# పగ

పాము చంపాలని నాగిరెడ్డి దుడ్డుగర్ర తీసుకొని, పేంట్‌పైకి మడిచి, తువ్వాలు తలకు చుట్టుకొని, మీది మీదికి వస్తూ గలాటా సృష్టిస్తున్నాడు.

నాగరాజు తమ కులదైవమని, ఆ స్వామి ఎవరినీ ఏమీ చేయడని, తమని కాపాడటానికే వస్తూ పోతూ ఉంటాడు కానీ మంచిదేవుడని, ధర్మప్రభువని, ఇటు రావద్దు స్వామి, వచ్చి ఉంటే వెళిపో దేవరా అంటే వెళిపోతాడని, నా మాట నమ్మండని, నలుగురి కాళ్ళా వేళ్ళా పడుతూ ఉంది నాగలచ్చువమ్మ.

నలుగురు తిరిగేచోటు కాబట్టి విషప్పురుగు తిరగరాదు కాబట్టి, తిరుగుతుంటే ప్రమాదం, ప్రాణహాని కాబట్టి, పాము కనబడితే చంపకుండా వదలరాదని తోవన వస్తూ పోతూ ఉండేవాళ్ళు హెచ్చరిక చేసి నాగిరెడ్డిని 'చంపు!' అంటూ ప్రోత్సహిస్తున్నారు.

అనంతపురం రైల్వే లైన్ల ఓవర్ బ్రిడ్జి పక్కన ప్రభుత్వ కళాశాల హాస్టలు కాంపౌండు గోడ వెలుపల రోడ్డు వారా నాగలచ్చువమ్మ కుండలు, బానలు, కడవలు, కూజాలు పిడతలు, చట్టులు, ముంతలు, మూకుళ్ళు సైజుల వారీగా అమర్చి, పేర్చి పెట్టుకొని అమ్ము కొంటూ ఉంది. ఆ పాత్రల్లో పాము ఉందంటే-ఉన్నా, లేకున్నా, మనుషులు తిరిగే చోట పాముండదు, వచ్చి ఉంటే ఎవరికీ కనిపించకుండా ఏ చీకటి పొద్దో వెళిపోతుంది-నింద మోపటమే. నిందమోపి కుండలు పగలగొట్టి నోటి కూటిలో దుమ్ము చల్లటమే.

అమ్మిరెడ్డి అనబడే అనిమిరెడ్డి, హనిమిరెడ్డి హనుమారెడ్డి నాగిరెడ్డి తండ్రి, ఊరిరెడ్డి, కూడేట్లో తమకు కూడూ నీళ్ళూ గూడూ నీడలేకుండా చేసిన మోతుబరిది పాము పగ అని, అది ఏడుతరాలు వెంటాడుతుందని నాగలచ్చువమ్మకు అప్పట్లో తెలియదు. ఇప్పుడిప్పుడే తెలుస్తూ ఉంది. తెలిస్తే మాత్రం ఏం చేయగలదు?

ఊరిడిచి, కూతుర్ని చంకనేసుకొని, కొడుకు చేయి పట్టుకొని అనంతపురం చేరి ఎట్టో బతుకుదెరువు చూసుకొని, నాలుగు పాత్రలమ్ముకొని గంజి తాగుతుంటే, అక్కడికి వచ్చి, పామును చంపుతానంటూ పాత్రలు పగలగొట్టటానికి పూనుకొన్న నాగిరెడ్డి అసలు ఆలోచన, ఇక్కడ కూడా నిలువనీడలేకుండా చేయటానికే అని ఎవరితో చెప్పగలదు, ఎవరు వినగలరు, ఎవరు ఆదుకోగలరు.

పామంటే అందరికీ భయమే. అది వెళిపోతేసరి, వెళ్ళకపోతే వెళ్ళగొట్టాలి. అయినా పోకపోతే చంపాలి అని జనం నిశ్చితాభిప్రాయం.

నాగలచ్చువమ్మ ఇల్లంటే గోడకు వేలాడగట్టిన నాలుగు గోనె సంచులు. వాటిమీద వేసిన ప్లాస్టిక్కు కవర్లు. అందులోనే తిండి తీర్థం, వంటావార్పు, పడకా పరదేసు. రోజంతా కుండలుకాడే ఉండే ఈ ఏర్పాటు, అమ్ముకోవటానికి, కాపాడుకోవటానికి వీలుగా ఉంది. ఇప్పుడీ పీడ చుట్టుకొంది.

ఉదయమే లేచి స్నానం ధ్యానం ముగించి, పూలూ పళ్ళూ టెంకాయా తీసుకొని, ఫస్టురోడ్డు రాఘవేంద్ర స్వామి గుడికి పోయి, పూజ చేసి వస్తూ టెంకాయ చిప్ప 'నీ బిడ్డ లచ్చిందేవే' అని పాపకిచ్చి పోతూ ఉండే శాస్త్రి వచ్చి టెంకాయ చిప్ప ఇచ్చి యేమిరా పాపోడా గలాటా?' అని నాగిరెడ్డిని అడిగి, విషయం విని, 'కుండలు తీసి పక్కగా అలాదుగా పెడితే పామున్నదీ లేనిదీ తెలిసిపోతది, ఉంటే సంపేదే! లేకపోతే లేకపాయె. కుండలు పగలరాదు, పేదరాలు కుమిలి కుమిలి ఏడవరాదు. పేదోల్ల కడుపు గొడితే పెద్దోల్ల పుట మారతది. అందరూ సల్లగా బతకాల్ల' అన్నాడు.

వింటున్న అందరూ నిజమే అనటంవల్ల నాగిరెడ్డికి ఏమీ అనే అవకాశం లేకపోయింది.

నాగలచ్చువమ్మ తన గోనె సంచుల ఇంటికి ఆ ప్రక్కగా గోడ వారా పాత్రలన్నీ రెండు రెండు పెద్దవి, నాలుగైదు చిన్నవి తీసుకొని పోయి పేరుస్తూ ఉంటే అందరూ ఆత్రంగా పాముకోసం వెదుకుతుంటే నాగిరెడ్డి బుసకొడుతూ చేతికర్ర మోటు పెట్టుకొని వింతలూ విడ్డూరాలు చూపే పసిపిల్లవాడిలాగా పాతికేళ్ళవాడు పరాభవించినవాడుగా ఆనందపడుతున్నాడు.

పిల్లలిద్దరూ గోనె పట్టల నీడలో టెంకాయచిప్ప పీక్కుతింటుంటే, వంచిన నడుం ఎత్తకుండా, అటువి ఇటు సర్దుతూ కుండలు పేరుస్తూ ముక్కుతూ మూలుగుతూ ఉన్న నాగలచ్చువమ్మకు గతంలో విన్నవీ, చూసినవీ, అనుభవించినవీ ఒక్కొక్కటీ గుర్తుకు రాసాగాయి.

తనమామ, తన తల్లికి అన్న, పేరు నాగులు, ఊరుకూడేరు పేరు మోసిన బ్రహ్మ, సృష్టికర్త. మామ మంటిని తేవటం కలపటం, ముద్ద చేయటం, సారెమీద పెట్టటం, తిప్పటం రకరకాల పాత్రలు క్షణాల్లో తీయటం, ఒత్తటం, దిద్దటం, కాల్చటం, బండికట్టటం, అమ్మటం అనంతపురం తోలటం ఎంత అద్భుతంగా చేసేవాడు. ఎంత కళగా చేసేవాడు! ఎంత నేర్పుగా తీర్చిదిద్దేవాడు. మట్టిని మట్టిలాగా పట్టుకొనేవాడా–

అన్నంలా కలుపుకొనేవాడు. మట్టి ముద్దను అన్నం ముద్దలాగా తీసుకొనేవాడు. పాత్రల్ని పసిపాపల్లాగా సున్నితంగా సుతారంగా ముద్దుపెట్టుకొన్నట్లు ఎత్తి కూర్చోబెట్టేవాడు.

నాగుల పాత్రలకు ఎక్కడలేని గిరాకీ! బాగా అవి అమ్ముడు పోయేవి. ఎక్కడెక్కడి వాళ్ళు వాటిని అడిగి కొని తీసుకుపోయేవాళ్ళు. వాటి పనితనం, నాణ్యత గూర్చి జనం బాగా చెప్పుకొనేవాళ్ళు. మట్టి ముద్దలో నాగులు తన హృదయమార్దవం ఉందని విశ్వసించేవాడు. సారె చక్రం తిరగటంలోనే భూచక్రం తిరగటం, భూగోళం క్షేమంగా ఉండటం ఆధారపడి ఉన్నాయని నమ్ముతూ ఉండేవాడు నాగులు.

కూడేట్లో ఒకప్పుడు కమ్యూనిష్టు ప్రాభవం బాగా ఉండేది. సమానత్వం అనే మాట బాగా వినబడేది. ఆ రోజుల్లో నాగులు కొట్టం తొలగించి, మిద్దె కట్టుకొనే ఆలోచనతో ఉన్నప్పుడు నా మిద్దె కంటే పెద్దదికానీ, గట్టిది కానీ ఎత్తుదికానీ నువ్వు కట్టరాదని అమ్మిరెడ్డి శాసించినప్పుడు సరేనన్న నాగులు అక్షరాలా ఆ శాసనాన్ని పాటించాడు. కానీ ప్రమాదం జరిగిపోయింది. మిగిలిపోయిన కట్టుబడి సామగ్రితో మిద్దెమీద గదిగట్టి మెటికలు పెట్టాడు. అమ్మిరెడ్డి అనుమతి అడగటం మర్చిపోయాడు. తీరా కట్టటం ముగిసిపోయినంతలో అమ్మి రెడ్డి వచ్చి, ఆ గది పడగొట్టమన్నాడు. నాగులు నసిగాడు. నువ్వు పడగొట్టకపోతే నేను పడగొడతా నన్నాడు. అన్నాడు గానీ అన్నంత పని చేయబోతాడా అని గుంజాటనలో పడి తానాధ్యాస మర్చిపోయి, తాను కుండలు చేసి, బ్రహ్మలాగా ఊపిరి ఊదే పనిలో నిమగ్నమయి పోయాడు.

ఒకరోజు రాత్రి వాన కురుస్తున్నప్పుడు నాగులూ నాగులు భార్యా నిద్రపోతున్నప్పుడు, మిద్దె కూలిపోయింది. అమ్మిరెడ్డి కూల్చాడని, బాంబులు పెట్టి పేల్చాడని కొందరు. వానకు నాని కూలపోయిందని మరి కొందరు, అనుకొన్నారుకానీ కూలిన మిద్దెలో భార్యాభర్తలను బయటికి తీయలేకపోయారు. అదే వాళ్ళ సమాధి.

అటు కుండలు తీసి ఇటు పేర్చటంతో అలసిపోయి, చెమటలు పట్టి, రొంటిమీద చేతులు పెట్టుకొని నడ్డివిరుచుకొంటున్న నాగలచ్చువమ్మను చూస్తూ 'అయ్యో పాపం ఆడకూతురు అన్న వాళ్ళున్నారు కానీ ఆకుండ తీసి ఇటు పెడదాం అనుకొన్న వాళ్ళు లేకపోయారు. పామంటే ఎవరికి భయముండదు. ఏ కుండల్లో ఉందో, ఎప్పుడు లేచి బుస్సు మంటుందో అని అందరికీ భయమే!

సగం పాత్రలకు పైగా ఇటువి అటు చేరాయి. మిగతా సగం మార్చబోతూ నిజంగా పాము ఉంటే ఎట్లా, కాటేస్తుందా, తాను చనిపోతుందా, బిడ్డల గతేమి, ఎట్టా బతుకుతారు అని క్షణం సేపు భయపడింది నాగలచ్చువమ్మ.

వస్తే తమ కులదైవమే వస్తుంది, వస్తే తమను కాపాడటానికే వస్తుంది, ఆ నాగబాము వస్తే, తమకు అండే కానీ ఆపదకాదు, ధైర్యం తెచ్చుకొంది పిల్లల తల్లి.

మిద్దెలో అత్తామామలు సమాధి అయినప్పుడు నాగలచ్చువమ్మ మొగుడు, నాగరాజు, మేనత్త, పిల్లనిచ్చిన అత్త, దుత్తలూరమ్మ ఇంట్లో తీరని కొత్తపెళ్ళి మోజులో ఉన్నాడు.

కబురు తెలిసి పరుగు పరుగున కూడేరు పోయేనాటికి తల్లీ తండ్రీ లేరు. ఇల్లూ వాకిలి లేదు. ఆవురుమని ఏడ్చిన నాగరాజుకు ఆకలి పని నేర్పింది. తండ్రికి తగ్గ కొడుకు అనిపించుకొన్నాడు, మంచి పనివాడు అని పేరు తెచ్చుకొని, తండ్రి పని, కుల వృత్తి నేర్పుగా ఓర్పుగా చేసుకోసాగాడు కానీ మళ్ళీ మిద్దె నిలబెట్టలేకపోయాడు. ఆ గోడల్లోనే కొట్టం వేసుకొని, భార్యను పుట్టింటి నుంచి పిలిపించుకొని సంసారం సాదుకోసాగాడు. నాగలచ్చువమ్మ ఇద్దరు పిల్లల తల్లి అయ్యాక, ఇరవై ఏళ్ళు వచ్చి, ఇంటి పట్టున ఉండే మనిషి కావటంతో వన్నె తేలింది.

ఎప్పుడు చూశాడో నాగిరెడ్డి, తండ్రికి తగ్గ తనయుడు, నాగలచ్చువమ్మను చూడనే చూశాడు. ఇంటికి పిలిపించాడు. పోలేదు. ఇంటికి వచ్చాడు. పలకలేదు. 'వస్తావా? సస్తావా?' అన్నాడు. 'సంపుతా' నంది.

నాగులు కుటుంబం సొంత ఆస్తి నాగులకట్ట. నాగులకట్టంతా పాముల పుట్టలే! అక్కడి మట్టీ కుండలు చేయటానికి నాగులూ తెచ్చేవాడు. నాగరాజూ తెచ్చేవాడు. అక్కడ పుట్టల నిండా ఉండే పాములకు వీళ్ళు పాలు పోసేవాళ్ళు, పూజలు చేసేవాళ్ళు. నాగదేవతను ఆరాధించే వాళ్ళు, నాగరాజు వీళ్ళ కులదైవం. నాగులు ఆ నాగరాజు పేరే తన ఒక్కగా నొక్క కొడుక్కు పెట్టుకొన్నాడు.

నాగుబాములు నాగులు కుటుంబానికి ఏ కష్టం కలిగించవని జనం నమ్మకం. వీళ్ళలో ఎవరూ ఎప్పుడూ ఏ పాముకాటుకూ గురికాలేదు. వీళ్ళకు ఏ ఆపదా రాకుండా నాగుబాములు వీళ్ళను కాపాడతాయని జనం చెప్పుకొంటూ ఉంటారు. నాగలచ్చువమ్మ వీళ్ళ మాటలు విని నవ్వుకొనేది. నమ్మేది కాదు. వాటి జోలికి మనం పోకపోతే మన జోలికి అవి రావు అని నమ్మేది, అనేది. ప్రజలకు మూఢ విశ్వాసాలు ఎక్కువ అని కూడా నిరసించేది. నాగరాజు మాత్రం పాముల్ని కాదనడు, అవుననడు కానీ జరగవలసిన పూజలు మాత్రం జరిపించేవాడు.

అనంతపురంలో ప్రభుత్వకళాశాల హాస్టలు కాంపౌండు గోడ కాడ ఈ రోజు మాత్రమే నాగరాజు తన కులదైవమని, ఆపదరాదని, హాని జరగదని, అనటమే కాదు, దాదాపు నమ్మే పరిస్థితికి వచ్చేసింది. ఆపద, ప్రమాదం, గడిచే వేరే మార్గం లేనప్పుడు

మనిషి మూఢ విశ్వాసాలు ఆచారాలు, నమ్మకాలు అండచేరతాడు కాబోలునని నాగలచ్చునమ్మను చూసినవాళ్ళు అనుకొంటారు.

ఒకరోజు నాగరాజు బావిలో శవమై తేలాడు. ఏ నాగరాజూ ఈ నాగరాజును కాపాడలేకపోయాడు. ఆ రోజు ఆమె దుఃఖం అంతా ఇంతాకాదు.

పదిరోజులు కంటికి మంటికి ఏకధారగా ఏడ్చిన నాగలచ్చువమ్మను ఓదార్చిన తల్లిదండ్రులు వెళ్ళిపోయారు. ఇద్దరు పిల్లలతో తాను బతకాలి. భర్త చేసి పెట్టిన కుండలు కాలిస్తే అనంతపురం పోయి అమ్ముకోవచ్చు.

ఒకరోజు రాత్రి తాగి నాగిరెడ్డి, తడిక తోసుకొని కొట్టంలోకి వచ్చాడు. పిల్లల్ని పక్కలో వేసుకొని పడుకొన్న నాగలచ్చువమ్మ లేచి కూర్చుంది.

'అరిత్తే సంపుతా'నన్నాడు. 'గొంతు పిసకతా'నన్నాడు. 'నా పక్కలో పొడుకుంటే బతకతా'వన్నాడు. లేబోతే సత్తావ'న్నాడు.

అంతా విన్న నాగలచ్చువమ్మ ఎగిరిచ్చి దొమ్మలమీద తన్నింది. వెల్లికిలబడ్డాడు. లేచినవాణ్ణి మళ్ళీ తన్నింది. తడిక తలుపు అవతల పడ్డాడు. అరిసింది. నలుగురు పోగయ్యారు. నాగిరెడ్డి పరారయ్యాడు.

అందరికీ తెలుసు వచ్చినవాడు, పోయినవాడు నాగిరెడ్డేనని. ఎవరూ ఏమీ అనరు. ఏమీ సహాయం చేయరు. కానీ సలహా ఇచ్చారు. 'ఊల్లో ఉంటే గానీ బతకలేవ్. నీ తావ నువు జూసుకో'.

నాగలచ్చువమ్మలో ధైర్యం చావలేదు. ఊరొదిలిపోలేదు. భర్త ఆరబెట్టిన కుండలు పేర్చి ఆంవ కూర్చింది. ఆడ కూతురయినా కుమ్మరాంవ కూర్చిన నేర్పుకు పనిమంతులయిన కుమ్మరులు మగవాళ్ళు ఆశ్చర్య పోసాగారు. ఆ మధ్య ఆమె సారెతిప్పటం కుండలు వానటం చూసి జనం ముక్కులమీద వేళ్ళేసుకొన్నారు. మామ చాలు మొగుని సాలు పడిందని నమ్మసాగారు. మగ రాయుడిలాగా బతగ్గలదని భావించారు.

ఆంవ అంటుకొని వెలుగుతుంటే, తన బతుకు వెలుగుతుందని నాగలచ్చువమ్మ నమ్మింది. కానీ ఏం లాభం? కుండలన్నీ బాగా కాలి చల్లారితే బండికట్టి అనంతపురం తోలుకొని పోవచ్చు ననుకొంటున్నప్పుడు ఆంవంతా అఖండంగా ఎర్ర అగ్గిలాగా ఉన్నప్పుడు 'చట్'మన్న శబ్దం వచ్చింది. 'పట్' మోత వినబడింది. చట్ పట్‌లు ఎక్కువయ్యాయి. పట్‌మనేవి లేవు కానీ 'చట్'మనేవి అంటూనే ఉన్నాయి. చట్‌మనగానే ఒకటి లేచి వచ్చి నాగలచ్చువమ్మ నుదుటి కొట్టుకొంది. నుదురుకుండ కాదు కాబట్టి పగలలేదు. వేటుకు బొప్పి కట్టింది. వేడికి చర్మం మాడింది. తగిలినదాన్ని పట్టుకొని

చూస్తే తెలిసింది. గెచ్చకాయ. ఇంకా ఆంవలో గెచ్చకాయలున్నాయి. అవి చట్‌చట్‌మని లేస్తున్నాయి. వేడి తగిలితే పైకి లేస్తాయి. కుండలుంటే పగలగొడతాయి, లేకపోతే నిప్పుల్లో పడతాయి. ఆమెకు తెలిసిపోయింది. ఎవరో ఆంవలో గెచ్చకాయలు వేశారు. వేసింది ఎవరో ఆమెకు తెలుసు. కూడేట్టో అందరికీ తెలుసు.

'వాని యేటుకి నువ్ దట్టుకోలేవు ఆడా పగబట్టిన పాంవు. నువ్వా ఆడ గూతురివి. నీకా సంకబిడ్డ, సేతిబిడ్డ యట్టా బతుకుతావో ఎట్టో– నిన్నా ఆంబోతు ఈ వూల్లో ఉండనీడు. ఉంటే అణిగిమణిగి వుండు, పోతే పొట్ట సేత బట్టుకుపో! దేంముడే నీకు దిక్కు' అని ఎదురైన అందరూ సలహా ఇచ్చారు.

కన్నీరు దిగమింగిన నాగలచ్చువమ్మ ఇల్లు విడిచి, ఊరు వదిలి, నెత్తిన పెట్టుకోగల సామాను సర్దుకొని పిల్లల్ని తీసుకొని అనంతపురం వచ్చింది. గోడపక్క చేరి కుమ్మరి వాళ్ళు బళ్ళతో కుండలు అవీ తెస్తే వాటిని దింపుకొని అమ్మి తనింత తీసుకొని వాళ్ళకింత ఇస్తూ తన బతుకుతాను బతకాలని నాగ లచ్చువమ్మ నిశ్చయించుకొంది.

ఇక్కడివి తీసి అక్కడ పెట్టిన ఆమె భారంగా నిట్టూర్పు విడిచి నాగుబామూలేదు. నాప బండా లేదు, 'నా బతుకు బజారు కీడ్చింది సాలక నా ఉసురు గొట్టుకుపోయి సాయి సన్నాసి ముండా కొడక!' అంటూ శాపనార్థాలు పెట్టసాగింది.

ఆ నాగబాము దీనింటి కులదేవత కదా, దాన్ని ఇది దాచిపెట్టి లేదని బుకాయిస్తా ఉందని గోలచేయసాగాడు. నాగుబాము రావటం కుండల్లోకి పోవటం నేను చూశానన్నాడు. నాగిరెడ్డి. వెంట వచ్చిన అతని మనుషులు కూడా అదే కూత కూయసాగారు. బండిమీద చీనీకాయలమ్మే సన్నోనికి ఆమాటే నోటి వెంట వచ్చింది. అప్పుడప్పుడు నాగుబాము అటు వస్తూ పోతూ ఉండటం చీకట్లో కూడా తాను చూశానని పూలమ్మే నారాయణమ్మ చెప్పింది. ఈ మట్టి కుండలు గుట్టబెట్టి తన వ్యాపారానికి తకరారు తెస్తూ ఉందని చిల్లరంగడి చిన రంగప్ప పామును అప్పుడెప్పుడో తానూ చూశానన్నాడు.

ఇప్పుడు పాము కనరాలేదుకదా అని ఎవరో సర్దుబాటు చేయబోతే 'నీకేం తెలుసు పోలే! ఈ సగాల కనబడితే కాల్లిరిసి కారుకింద బెడతా' అన్నాడు నాగిరెడ్డి వెంట ఉన్న మనిషి.

'మరి పామేమాయె? యాడబాయె?' అని ఎవరో అడిగితే యాకుండలోనో ముడుక్కొని ఉంటది' అని జవాబు కూడా వినబడింది.

'యాకుండలోనో యట్టా తెలసల్లా' అంటే 'తెలుసుకోవల్ల' అనీ, 'లేకుంటే అన్నల్ది తెలిసే దాంకా ఒక్కోకుండా పగలగొట్టల్ల' అనీ ఆ మనిషే పరిష్కారం చెప్పాడు.

అక్కడ చేరిన వాళ్ళకు అంతా స్పష్టంగా అర్థమయిపోయింది. కుండలు పగలగొట్టి అయినా పామును చంపటానికి ముగ్గురు బలమైన యువకులు సిద్ధమయి ఉన్నారు.

'అమ్మయ్యా, అన్నా, సాంవీ, దేవరా నా కుండలు పగలగొడుతున్నారు. కాపాడండి, రక్షించండి' అంటూ నాగలచ్చుమమ్మ గోల పెడుతూనే ఉంది. వెంట ఉన్నవాళ్ళు పామును జంపుతున్నామన్నారు.

'కుండలు పగులుతున్నాయి. నా బిడ్డల కూడు' అంటూ తోవన పోయేవాళ్ళ కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమాలుతూ ఉంది నాగలచ్చుమమ్మ.

'పాం విసప్పురుగు, సంపనీ పాపా' అంటూ వాళ్ళూ వెళ్ళిపోతున్నారు.

నాగిరెడ్డితో పాటు వచ్చిన వాళ్ళు, ఆమెకు వత్తాసుగా ఎవరినీ మాట్లాడనీయకుండా, అందయి ఎవరూ ఆదుకోవటానికి రానీయకుండా నిలబడ్డారు.

నా కుండలు నా బిడ్డలు అటూ అంగలారుస్తూ అటూ ఇటూ పరుగుతీస్తూ ఉంది ఆమె.

నాగిరెడ్డి ఒక్కొక్క కుండ పగలగొట్టి 'ఇక్కడ లేదు. అవిట్లో ఉండి ఉంటాది' అంటూ మరో కుండల దొంతర దగ్గరకు పోతున్నాడు.

'ఈడా లేదు. యాడుండాదబ్బా' అంటూ ఆలోచనలో పడ్డాడు.

బ్రిడ్జిమీద జనం నిలబడి వింత చూస్తున్నారు. 'కుండలేల పగలనూకుతావ్‌లే' ని ఎవరూ అనలేదు.

తొందరగా పగల గొట్టటం పూర్తయితే ఇంటికి పోదామని, పని త్వరగా అయిపోతే బాగుండునని జనం ఆసక్తిగా ఉన్నారు అరిసి అరిసి బిడ్డల్ని డొక్కలో దూర్చుకొని నేలమీద పడి నెత్తిబాదుకొంటూ ఉంది ఆమె.

తీరుబడిగా, ఆమె కడుపు తరుక్కుపోయేట్టు, నాగిరెడ్డి పాత్రలు పిచ్చులు పిచ్చులు చేస్తున్నాడు.

ఏడిచే, అరిసే ఓపిక సన్నగిల్లి ఆమె నెత్తీనోరు కొట్టుకుంటూ ఉంది.

పగిలి పోయిన కుండల పెంకులు రాశులు రాశులుగా పడుతున్నాయి.

కొట్టీ కొట్టీ అలసిపోయి, చెమట తుడుచుకొంటూ గస ఆపుకొంటూ వొగురుస్తున్నాడు నాగిరెడ్డి.

ఇంక పాతిక కుండలు కూడా లేవు. చిన్నదీ చితకవీ ముందే ఉన్నాయి ముందుగా పగిలిపోయాయి. లేని ఓపిక, బలం, కసికొద్దీ తెచ్చుకొని, ఈడ్చి ఈడ్చి కొడుతున్నాడు నాగిరెడ్డి.

నాగిరెడ్డి నిట్టూర్పు పాము బుసలాగా ఉంది. అతడిది పాము పగ. తనను అవమానించి నాగి ఉండటమా, బట్ట కట్టటమా, దాని చావు అయినా అది చావాలి. లేదా తన పక్కలోకి అయినా రావాలి. అదీ కసి, అదీ పగ. అది పాముపగ. నాగిరెడ్డి నాగుబాము పగ.

నాగిరెడ్డి బుసకొడుతూ కుండ పగల గొట్టాడు.

బుస! పాంబుస! నాగుపాంబుస! నాగరాజు బుస.

నాగిరెడ్డి బుస కొడుతూ బానమీద దుడ్డుగ్రతో బాదాడు.

సరసరమని, జరజరమని బుస. నాగరాజు బుస.

నాగిరెడ్డి బుస. నాగు బామును చూశాడు. నాగరాజును చూశాడు.

నాగరాజు చూశాడు. నాగిరెడ్డిని చూశాడు. పగిలిన కుండల్ని చూవాడు. పడగ ఎత్తాడు.

నాగిరెడ్డి బుసకొట్టాడు. కర్రెత్తాడు, ఏటేశాడు. బాన పగిలింది.

నాగరాజు తప్పించుకొన్నాడు. నిలువెత్తున లేచాడు. నాగిరెడ్డి నుదుటిని పడగతో కొట్టాడు.

మిగిలి ఉన్న కుండల్ని బానల్ని చకచకా పగలకొట్టాడు. బద్దలు చేశాడు నాగిరెడ్డి.

నాగరాజు కనిపించలేదు. బుస వినిపించలేదు. పెంకుల్లో జరజర సరసర వినిపించింది. పెంకుల కదలికలు ఆగిపోయాయి. కదలిక ఆగిపోయింది.

నాగిరెడ్డి మట్టిపాత్రలు పగులగొట్టటం లేదు. నిలబడి లేడు. వంగిలేడు. నేలమీద పడి ఉన్నాడు.

నోటివెంట నురుగు వస్తూ వుంది.

పగిలిపోయిన పెద్ద బానలాగా పడి ఉన్నాడు నాగిరెడ్డి.

నాగరాజు పత్తాలేదు.

❁